


## నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల

# ‘కవి కోకిల’



‘నాయనా! పురుటింటి తెరువరి!
కులజ్యోతి! నీకు దీర్ఘాయువురా!
నవ మాసములు భోజనము నీరమెరుగక పయనించు పురుటింటి బాటసారి
చిక్కు చీకటి చిమ్ము జానెడు పొట్టలో నిద్రించి లేచిన నిర్గుణుండు
నును చెక్కిటుల బోసినవ్వుల నోటిలోన ముద్దులు చిత్రించు మోహనుండు
అక్షయంబైన మాతృ క్షీర మధు ధారలనంబుగా తెచ్చుకున్న అతిధి...
బట్టగట్టడు, బిడియాన పట్టుబడడు ధారుణీ పాఠశాలలో చేరినాడు....
బొటవ్రేల ముల్లోకములు చూచి లోలోపల ఆనందపడు నోరులేని యోగి
తల్లిదండ్రుల తనూవల్లరికి వన్నెలు పెట్టు తొమ్మిది నెలల పంట
అమృతంబు విషమను వ్యత్యాస మెరుగక ఆస్వాదింపజను వెర్రిబాగులాడు....
భాష రాదు, వట్టి పాలు మాత్రమె త్రాగు...
సతిని ముట్టని నాటి సాంబమూర్తి...
తన ఇంటి క్రొత్త పెత్తనపుదారి...
ఏమి పని మీద భూమికి ఏగినాడో
నుడువ నేర్చిన పిమ్మట నడుగ వలయు
ఏండ్లు గడిచిన ముందు ముందేమొ గాని
ఇప్పటికి మాత్రమే పాప మెరుగడితడు... ’

భాషకందని భావాలను అందించి, అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించి, మనల్ని ఓలలాడించే కవిత్వమిది.

తెలుగునాట ఈ నోటా నోటా ప్రతి పూటా వినిపించిన పాపాయి పద్యాలివి.

మధురమైన తెలుగు భాషలోని తీయదనాన్ని మనోజ్ఞంగా రుచి చూపించే కవిత్వమిది.

గుర్రం జాషువా కవి కోకిల మధుర కవితా గానమిది.

0 0 0

మహాకవి కాళిదాసు ఒక మేఘం ద్వారా మేఘసందేశం పంపిస్తే, భావనకి స్పందించి, సమకాలీన పరిస్థితుల్ని ఉద్దేశించి జాషువా వ్రాసిన కవితే గబ్బిలం. ఇందులో యక్షుడూ లేడు, మేఘమూ లేదు. ఆకలితో బాధ పడుతున్న ఒక పేదవాడు, శివుడు గుడినించీ వచ్చిన ఒక గబ్బిలంతో తన గోడుని దేవుడికి చెప్పమని ఇచ్చిన సందేశం. ఒక గబ్బిలాన్ని గుడిలోకి రానిచ్చిన మనుష్యులు, తనలాటి సాటి మనిషిని గుడిలోకి రానివ్వటంలేదని వాపోయాడు. గర్భగుడిలో తల్లక్రిందులుగా వ్రేలాడుతున్నప్పుడు, తన మనసులోని బాధని శివుని చెవిన వేయమని గబ్బిలాన్ని కోరుతాడు. అదీ పూజారి అక్కడ లేనప్పుడు చెప్పమంటాడు.

1941లో వ్రాసిన 'గబ్బిలం' జాషువా రచనల్లో చాల పేరుపొందినది. హరిజనుడుగా, దళితుడిగా ఆయన అనుభవించిన మనోవేదనకి అద్దం పట్టిన రచన. అదేకాక జాషువాకి భారతదేశం మీద వున్న ప్రేమ, దేశభక్తులను కూడా చూపిస్తుంది 'గబ్బిలం'.

0 0 0

గుంటూరు జిల్లాలోని వినుకొండ పట్టణంలో 1895 సెప్టెంబర్ 28న ఒక క్రిష్టియన్ కుటుంబంలో జన్మించిన గుర్రం జాషువా, స్కూల్లోనూ కాలేజీలోనూ చదువుతున్నప్పుడూ, అటుపిమ్మట కవిగా రాటుతేలిన తర్వాత కూడా సమాజంలో ఒక హరిజనుడుగా, అంటరానివాడుగా చూడబడ్డాడు. దానికి తోడు అతని పేదరికం ఒకటి. వీటన్నిటి వల్లా జాషువా, అతని కుటుంబం పడరాని కష్టాలు పడ్డారు. ఈనాటిలా ఆ రోజుల్లో దళితులకి రిజర్వేషన్లు, హక్కులు, సమాజంలో గుర్తింపు అసలు లేనే లేవు మరి.

జాషువా క్రిష్టియన్‌గా పుట్టి పెరిగినా, ఆయనలో హిందూమతం మీద జిజ్ఞాస కలిగి, పురాణాలు చదివి వాటి మీద కవితలు వ్రాస్తుంటే తోటి మతస్థులకి నచ్చలేదు. ఆయన కుటుంబాన్ని మతంలో నించీ వెలివేసే దాకా వెళ్ళారు. అయినా ఆయన చలించలేదు. మధురమైన కవిత్వం తీయనైన తెలుగులో వ్రాస్తూనే వున్నాడు. ఇటు తెలుగు, అటు సంస్కృతాలలో ఉభయ భాషా ప్రవీణుడిగా ఉత్తీర్ణుడయాడు. కొన్నాళ్ళు ఎలిమెంటరీ స్కూల్లో పంతులుగా ఉద్యోగం చేసి, దరిమిలా మద్రాసులో ఆల్ ఇండియా రేడియోలో తెలుగు కార్యక్రమాల నిర్వాహకుడిగా చేరాడు. అక్కడే పద్నాలుగేళ్ళు, అంటే 1946 నించీ 1960 దాకా పని చేశాడు. 1971 జులై 24న పరమపదించాడు.

0 0 0

జాషువా కవిత్వాన్ని భాషా పరంగానూ, విషయ పరంగానూ చూస్తే నాకు కనపడేవి ఇవి.

భాషాపరంగా చూస్తే ఆయన వాడినది చాల వరకూ తేనె లొలుకు తీయని తెలుగు. ఒక చోట పోతన గుర్తుకొస్తే, ఇంకొక పక్క జాషువానే కనిపిస్తాడు. చందోబద్ధంగా వ్రాసినా, గేయ రూపంలో వ్రాసినా ఆయనకి తెలుగు భాష మీద వున్న పట్టు కనిపిస్తుంది.

వల్లమాలిన భాషాభిమానం కనిపిస్తుంది. దువ్వూరి రామిరెడ్డి, కరుణశ్రీల బాణీలకి ఈయనే స్పందన అయివుండవచ్చా అని కూడా నాకు అనిపిస్తుంది.

విషయపరంగా చూస్తే గబ్బిలం, ఫిరదౌసిలలో అణగదొక్కబడ్డ కవి ఒక స్ప్రింగ్‌లా పైకి లేవటం కనిపిస్తుంది. అదీ ఒక విప్లవకారుడిగా కాదు. సమాజంలోని కుళ్ళుని, తన బాణీలో వెలికి తెచ్చిన కవిగా.

తర్వాత కనపడేది ఆయన దేశభక్తి. భారతదేశమన్నా ఆంధ్రదేశమన్నా తనుకున్న అభిమానాన్నీ ప్రేమనీ ఆయన అవకాశం వున్నప్పుడల్లా చూపిస్తూనే వున్నాడు. మహాత్మా గాంధీ వల్ల తను ఎంత ప్రభావితమైనదీ 'బాపూజీ' అనే కవితలో చూపిస్తాడు.

జాషువా కవిత్వంలో కనిపించే ఇంకొకటి మనసుని కట్టుకునే ఒక ఆర్ద్రత. అవి పాపాయి పద్యాలయినా, బుద్ధుడు, బుద్ధ మహిమలాటివి ఏవైనా సరే.

హరిశ్చంద్రుడిని కాటికాపరిగా ఆయన చూపించిన పద్ధతి చెప్పుకోదగ్గది.

అలాగే ఆయన హిందూ పురాణాల విషయపరంగా ఎన్నో వ్రాశాడు.

జాషువా వ్రాసిన కావ్యాలూ, కవితలూ ఎన్నో వున్నాయి. ఎన్ని విషయాల మీద ఆయన వ్రాశారో చెబుదామని వాటిలో కొన్నిటిని నామరూపేణా పరిచయం చేస్తున్నాను. అవేమిటంటే:

రుక్మిణీకల్యాణం, కుశలవోపాఖ్యానం, కోకిల, ధ్రువవిజయం, కృష్ణానది, శివాజీ ప్రబంధము, కృష్ణదేవరాయలు, వేమన యోగేంద్రుడు, భారతమాత, సూర్యోదయం, చంద్రోదయం, గిజిగాడు, ంధుడను, బుద్ధ, తెలుగుతల్లి, శిశువు, భాష్ప సందేశం, శిల్పి, హెచ్చరిక, సాలీడు, మాతృప్రేమ, భీష్ముడు, యుగంధర మంత్రి, నెలబాలుడు, అనసూయ, శాల్య సారథ్యము, అనాథ, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, బుద్ధమహిమ, క్రీస్తు, గుంటూరు సీమ, వివేకానంద, అఖండ గౌతమి, స్మశాన వాటి, ఆంధ్రభోజుడు, గబ్బిలం, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, క్రీస్తు చరిత్ర, ముసాఫిర్లు, నాగార్జున సాగరం, నా కథ మొదలైనవి.

ఆయన వ్రాసిన నాటకం 'హరిశ్చంద్ర' బాగా పేరుపొందిన నాటిక!

'క్రీస్తుచరిత్ర' జాషువాకి సాహిత్య అకాడమీ బహుమతి సంపాదించిన రచన.

ఆంధ్రా యూనివర్సిటీ యన్ని కళాప్రపూర్ణగా గుర్తించింది.

భారత ప్రభుత్వం జాషువాకి పద్మభూషణ్ పురస్కారమిచ్చి తన గౌరవం కాపాడుకుంది.

0 0 0

ఆయన భాషా సౌందర్యం, భావ వైవిధ్యం ఎలా వుంటుందో కొంచెం రుచి చూద్దాం.

'కులముల్ గొమ్ములాటల గుమ్ముకొని చిక్కుల్ పెక్కు సృష్టించు పె
ద్దల కాలాలు గతించి పోయినవి స్వాతంత్ర్యంబు సిద్ధించె రా
జుల సింహాసన మెక్కినారు ప్రజలెచ్చుందగ్గులం బాపూజీ
హాలిక శ్రేష్టుడు దున్నినాడిపుడు లేవంతస్థు లాంధ్రాక్షితి!' అంటాడు జాషువా ఆంధ్రమాత అనే కవితలో.

కవితలోవే ఇంకా కొన్ని పద్యాలు:

'పెను స్వార్థంబు మహా పిశాచము వలెన్ బీడింప దేశంబు చి
క్కిన శల్యంబయి తూలిపోయినది ఈ కీడుం దొలగించు చ
క్కని మార్గంబుపదేశ మిచ్చుకుని ముక్తాస్వచ్ఛ భావంబు నీ
యనుంగు బిడ్డలలో సృజింపుము త్రిలింగాద్రి క్షమాభూషణీ!'

'కృతులందుటకు పల్లకీ మోయ దొరకొన్న
కృష్ణరాయడు రాజ్యమేలినాడు
మనుమసిద్ధియును దిక్కన గన్న కావ్యంబు
కొరచూపులు జూచుకొన్ననాడు
తెలుగురాయని మొప్పులొలుకు గుప్పిటలోన
లేత కస్తూరి గుబాళించునాడు
ముత్యాల మందిరంబుల సత్కవుల మీద
బంగార మేరులై పారునాడు
కవుల పల్కులు వేదవాక్యంబు లగుచు
క్షితి తలంచును గంపింప జేయునాడు
గారావంబున నన్నేల గాంచవైతి
తెలుపగవమ్మ నన్ను గన్న తెలుగుతల్లి!'

'అలసాని కులజు డూయల మంచముల నుండి
పసిడి లేఖను బూని వ్రాయునాడు
పోతనార్యుని గేహమున భారతీదేవి
చిగురు జేతుల వంట జేయునాడు
భువన భీకరుడు వేములవాడ భీమన్న
గంగ్రాజునకు జోలె గట్టునాడు
శ్రీనాధ కవి పాండితీ వైభవము మీఱ
డిండిమ భట్టు నోడించునాడు
కనుల జూచెడు భాగ్యంబు గలిగియున్న

నేడు నా కవిత్వంబు రాణించియుండు
గారావంబున నన్నేల గాంచవైతి
తెలుపగదమ్మ నన్ను గన్న తెలుగుతల్లి!'

0 0 0

బాపూజీ హత్య జరిగాక, జాషువా ఎంతో బాధ పడుతూ వ్రాసిన కవితలు ముచ్చటగా మూడు:

'జగమొక్కుమ్మడి రొమ్ము గ్రుద్దుకుని మూర్ఛిందేలి తబ్బిబ్బు జెం
దగ చేజిక్కిన మొన్న మొన్నటి స్వతంత్ర స్వర్గ సౌధంబులో
పొగ రేగగన్ బగవాడు లేని భువనంబున్ గన్న బాబున్ భవత్
భగవంతున్ దయమాలి చంపుకునినావా? భారతాంబమణీ!

భువనమందు సీమ నరపాలుర తోడ నెదిరించి వెన్కకున్
దగ్గక రక్తపుంజినుకు నష్టముగాని స్వరాజ్య యుద్ధమున్
నెగ్గించినట్టి భారత ముని ప్రవరుండు క్షమా ప్రవాసి, యా
ముగ్గిన పండు బోనమయి పోయెనే నేడు తుపాకీ గుండ్లకున్!

ఇదియే పోవడమా! జగజ్జనక! రానేరావుగా! నూట ము
ప్పది యేడుల్ మనువాడనన్న నుడికిన్ భంగము వాటిల్లెనే!
ముదితాత! ప్రతి రక్తపు బిందువును మా పూర్ణ స్వరాజ్యార్థమై
కొదలేకిచ్చిన నీ విషాద మరణాగ్నుల్ గాల్చె ముల్లోకమున్!'

ఇలాటి పద్యాలూ, కవితలూ జాషువాలాటి కవి కోకిలలు గాక వేరెవరు వ్రాయగలరు?

0 0 0